జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 8 | మే | 2026 ◆ పేజీలు : 6

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 7 ( ప్రజా జ్యోతి)** స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ప్రతి నెలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే నేడు గోడౌన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి, కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థలను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. అనుమతి లేని వ్యక్తులను గోడౌన్ పరిసరాల్లోకి అనుమతించరాదని

మిగతా 2 లో...



# పాల్వంచ చెంతనే...

# 'పవర్' కష్టాలు

6 లో..

- వేసవిలో లక్ష్మీదేవిపల్లి విలవిల
- లోవోల్టేజ్‌తో అంధకారంలో గ్రామ జీవనం
- వెలుగులు పంచే పాల్వంచలోనే చీకటి కష్టాలు
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న గ్రామస్తులు

## వెలుగుల నీడలో వోల్టేజ్ చీకట్లు

మండుతున్న ఎండలు, ఉక్కపోత వాతావరణం, మరోవైపు తీవ్రమైన లోవోల్టేజ్ సమస్య... ఈ రెండింటి మధ్య లక్ష్మీదేవిపల్లి గ్రామ ప్రజల జీవితం దుర్భరంగా మారిందని, పేరుకు విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ, ఇళ్లలో సరిపడా వోల్టేజ్ అందక నరకయాతన అనుభవిస్తున్నామని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎన్నో ఏళ్లుగా సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకున్నా స్పందన లేకపోవడంతో గ్రామస్తుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

● పాల్వంచ, ప్రజాజ్యోతి

## పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బంది పిల్లలకు ఎస్పీ రోహిత్ రాజు అభినందనలు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 7, ప్రజా జ్యోతి:** ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మొత్తం 63 మంది పోలీసు సిబ్బంది పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన కొందరు విద్యార్థులు తమ విజయానికి తల్లిదండ్రుల కష్టమే కారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో చేరుకోవాలనుకుంటున్న లక్ష్యాలను వివరించారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఎస్పీ రోహిత్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, ప్రజలకు సేవలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు గుర్తించాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం ఉంటే

మిగతా 2 లో...

## రూ.3.50 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎఫ్‌డీవో, డీఆర్‌వో



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 7, ప్రజా జ్యోతి:** భద్రాచలం అటవీశాఖ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఇద్దరు అటవీశాఖ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. భద్రాచలం ఫారెస్ట్ డివిజనల్ అధికారిణి (ఎఫ్‌డీవో) సుజాత, చర్ల ఇన్‌చార్జి డీఆర్‌వో కృష్ణయ్య రూ.3.50 లక్షలు లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.వివరాల్లోకి వెళితే.. చర్ల మండలం పూసగుప్ప ప్రాంతంలో నూతన రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో అటవీశాఖ పరిధిలోని కొన్ని చెట్ల తొలగింపుపై నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంటూ, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు అధికారులు రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధిత కాంట్రాక్టర్

మిగతా 2 లో...

## విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్‌లకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి

- వరదలు, అటవీ ప్రమాదాల నియంత్రణపై ఎన్‌డిఎంఏ వీడియో కాన్ఫరెన్స్‌లో
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 7,(ప్రజా జ్యోతి)** జిల్లాలో వరదలు, అటవీ ప్రాంతాలలో సంభవించే ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి, విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్‌ల నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఏ) ఆధ్వర్యంలో వరదలు, అటవీ ప్రమాదాల నియంత్రణపై జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

మిగతా 2 లో...

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్




(మొదటి పేజీ తరువాయి...)

భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్ డి ఓ మధు,ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.3.50 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎఫ్‌డీవో, డీఆర్‌వో

(మొదటి పేజీ తరువాయి...)



ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళికతో భద్రాచలం అటవీశాఖ కార్యాలయంలో ఉచ్చుపన్నగా, గురువారం రూ.3.50 లక్షలు లంచం తీసుకుంటున్న సమయంలో ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ మాట్లాడుతూ, వచ్చిన విశ్వసనీయ సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అధికారులను పట్టుకున్నామని తెలిపారు. పట్టుబడిన అధికారులను విచారణ అనంతరం ఏసీబీ కోర్టు, హైదరాబాద్‌లో హాజరుపరుస్తామని చెప్పారు.అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు భయపడకుండా ఏసీబీని సంప్రదించాలని సూచించారు. అవినీతి నిరోధానికి ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.

## పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు



(మొదటి పేజీ తరువాయి...)

ఎలాంటి లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని అన్నారు.జీవితంలో ప్రతి రోజూ కొత్త విషయాలను నేర్చుకునే తపన ఉండాలని, మంచి స్నేహితులను ఎంచుకుని దురలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను సాధించి తమ తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పోలీస్ కుటుంబంలో జన్మించి పెరిగిన తాను, బాల్యం నుంచి ఐపీఎస్ సాధించే వరకు ఎదుర్కొన్న అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎంటీవో సుధాకర్, హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఆర్‌ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్‌ఐ లాల్‌బాబు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఆమ్ బజార్ వైపు...

# కన్నెత్తి చూడరా?

- మున్సిపల్ అధికారుల అడుగు ముందుకు పడేనా!
- డ్రైనేజీలను దాటి మరి వ్యాపారాలు, నిర్మాణాలు కనిపించడం లేదా?
- దర్జాగా వ్యాపారం చేస్తున్న వ్యాపారులు!
- అధికారుల మౌనంపై ఆంతర్యమేమిటో?
- నోటీసులు ఇచ్చి మమ అనుకుంటున్నారా?
- నెలలు గడుస్తున్న మారని అధికారుల తీరు!
- మెయిన్ రోడ్డు చిరు వ్యాపారులపైనే ప్రతాపమా
- ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తున్న జనం
- ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అసలు నిజాలు బహిర్గతం

**ఇల్లందు, మే 7, ప్రజాజ్యోతి:** సాధారణంగా ఓ శాఖలో ప్రతి ఒక్కరికి ఒకే నిబంధనలు ఉండడం సహజం. కానీ ఇల్లందు మున్సిపాలిటీలో మాత్రం అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని ఆమ్ బజార్ లో గత కొన్ని ఏళ్ల నుండి డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అవి మున్సిపల్ అధికారులకు కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇల్లందు ప్రధాన ప్రాంతమైన ఆమ్ బజార్ లో బడా వ్యాపారులు ప్రధాన రహదారులపై చిన్నచిన్న వ్యాపారులు, బండివాళ్లపై మాత్రం కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు, ఆమ్ బజార్‌లో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నోటీసులు ఇచ్చామని చెప్పడం తప్ప, వాటి అమలులో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీలపై నిర్మాణాల కారణంగా వర్షాకాలంలో పారిశుద్ధ్య వ్యవస్థ దెబ్బతినడం వల్ల వాటి నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమ్ బజార్‌లో బడా వ్యాపారులు తమను ఎవరు ఏమి అనరనే ధీమాలో.. ఎవరు ఇటువైపు కన్నెత్తి చూడరనే ధోరణిలో దర్జాగా వ్యాపారాలు కొనసాగిస్తున్నప్పటికి అధికారుల మౌనం వెనుక అసలు ఆంతర్యం ఏమిటనే చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది. నెలలు గడుస్తున్న పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి రెట్టింపు అవుతుందనేది స్పష్టమవుతుంది. మరి ముఖ్యంగా ఆమ్ బజార్ లో డ్రైనేజీల పైనే వ్యాపారాలు, అక్రమాలు చేస్తున్నా కానీ అవి కనిపించడం లేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో పలు మార్లు దశల వారిగా ఆమ్ బజార్ వ్యాపారులకు మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకుండా మమ అనిపించుకున్నారనేది కండ్లకు కనిపిస్తుంది. ఇలా ఆమ్ బజార్ బడా వ్యాపారులను ఒక మాదిరిగా మెయిన్ రోడ్డు వెంబడి వ్యాపారాలు చేసే చిరు వ్యాపారుల పట్ల అంత వ్యత్యాసం ఎందుకని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆమ్ బజార్ ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపితే అసలు నిజాలు బహిర్గతం అయ్యే అవకాశం లేకపోలేదని, ఆ దిశగా ఉన్నతాధికారులు చొరవ చూపాలని, డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.




## విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్‌లకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

ద్వారా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్‌తో కలిసి ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎంఎ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహాల్ మాట్లాడు తూ, జిల్లాల్లో వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు లేదా ఇతర విపత్తులు సంభవించిన సమయంలో అధికార యంత్రాంగం వేగంగా, సమన్వయంతో స్పందించేందుకు ముందస్తు సిద్ధత ఎంతో అవసరమని తెలిపారు. ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా విపత్తుల నిర్వహణకు సంబంధించిన మాక్ ఎక్సర్సైజ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడిస్తూ, అందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే సమీక్షించాలని సూచించారు.ఇటీవల వాతావరణ మార్పుల ప్రభావంతో తక్కువ సమయంలోనే భారీ వర్షాలు కురిసి ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయని, అగ్ని ప్రమాదాల వల్ల అటవీ ప్రాంతాలు నష్టపోతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా అటవీ ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల సమయంలో పాటించాల్సిన ప్రామాణిక విధానాలపై (ఎస్‌ఓపీ) స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి శాఖలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులతో మాట్లాడుతూ, గోదావరి పరివాహక ప్రాంతంలో వరదలు సంభవించినప్పుడు జిల్లాలో చేపడుతున్న ముందస్తు, తక్షణ చర్యలను వివరించారు. వరదల అంచనా విధానం, ముందస్తు హెచ్చరికల జారీ, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, పునరావాస కేంద్రాల నిర్వహణ, లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదలు, అటవీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం సమన్వయంతో స్పందించేలా సమగ్ర మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, సీపీఓ సంజీవరావు, మిషన్ భగీరథ అధికారి తిరుమలేష్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, డి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులు,డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ అంకిత్






**కొత్తగూడెం కలెక్టరేట్, మే 7, (ప్రజా జ్యోతి)** ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పి సి పి ఎన్ డి టి) చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు పై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌ల నిర్వహణ, అనుమతులు, నిబంధనల అమలుపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే సీజ్ చేయాలని సూచించారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు.వైద్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఉన్న లోపాలను గుర్తించి వారికి తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సీజ్ చేయాలని స్పష్టం చేశారు.డయాగ్నస్టిక్ సెంటర్లలో పరీక్షల ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ప్రతి సంస్థలో రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు, అర్హత కలిగిన సిబ్బంది వివరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు .అర్హతలు లేకుండా వైద్యం నిర్వహిస్తున్న ఆర్ఎంపీ వైద్యులపై కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను వెంటనే సీజ్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ వైద్య సేవలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టాన్ని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేయాలని, గర్భ లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎటువంటి ఉపేక్ష ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్ల రికార్డులు, రిజిస్టర్లు, ఫారమ్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈసమావేశంలో భాగంగా రెన్యువల్ కోసం వచ్చిన 46 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. వైద్యశాఖ అధికారులు చెక్ లిస్ట్ ఆధారంగా అన్ని ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, , పాల్వంచ డి.ఎస్.పి సతీష్‌కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్జీవో ప్రోగ్రామ్ ఆఫీసర్ సంజీవరావు, డాక్టర్ రాందాస్, డాక్టర్ హరీష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగలక్ష్మి , బేబీ హెల్త్ ఎడ్యుకేటర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో 817 సర్వే భూ సమస్యను పరిష్కరించాలని మంత్రి పొంగిలేటికి కార్పొరేటర్ నూకల సరిత వినతి



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 7, (ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 817తో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో కొనసాగుతున్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి 5వ డివిజన్ కార్పొరేటర్ నూకల సరిత గురువారం వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూముల యాజమాన్య హక్కులపై స్పష్టత లేకపోవడం, రికార్డులలో లోపాలు, అదేవిధంగా భూ వివాదాలు కొనసాగుతుండటంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సర్వే నంబర్ 817లో సమగ్ర సర్వే నిర్వహించి, పాత , ప్రస్తుత రికార్డులను సమన్వయం చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి ని కోరినట్లు తెలిపారు.అలాగే 444,999,727 సర్వే నెంబర్ల భూ వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వార పాల్వంచ పట్టణ అభివృద్ధి వేగవంతమవుతుందని తద్వార నిర్మాణ, వ్యాపార రంగాలు పుంజుకోవడం ద్వార ఎంతో మందికి ఉపాది అవకాశాలు లభిస్తాయని ,అవసరమైతే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.ప్రజల సంక్షేమాన్ని పాల్వంచ పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మంత్రి ఈ సమస్యల పై సానుకూలంగా స్పందించారని త్వరలో చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తానని మంత్రి పొంగులేటి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

# మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులు



**చర్ల, మే 07: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గురువారం స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం సాగించిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. “అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తి ప్రదాత అని దేశభక్తి, ధైర్యసాహసాలకు ఆయన ప్రతీక” అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి



**చర్ల, మే 07(ప్రజా జ్యోతి ):** మన్యం వీరుడు విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతిని గురువారం చర్ల మండల కేంద్రంలోని హైస్కూల్ వద్ద గల అల్లూరి విగ్రహం వద్ద ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్ ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షు లు కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గిరిజన ప్రజ ల హక్కుల సాధన కోసం దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసి న మహనీయుడని కొనియాడారు. బ్రిటిష్ పాలకులకు సింహస్వప్నంగా నిలిచిన అల్లూరి సీతారామరాజు గెరిల్లా యుద్ధ నాయకుడిగా మన్యం ప్రాంత ప్రజ ల్లో పోరాట స్ఫూర్తిని నింపారని తెలిపారు.అలాంటి మహనీయుని ఆశయాలను నేటి యువత కొనసాగించాలని సమాజ మార్పు కోసం ఆయన బాటలో ముందుకు సాగాలని ముసలి సతీష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో విద్యుత్ శాఖ ప్రత్యేక సమావేశం





**పినపాక,మే 07(ప్రజాజ్యోతి ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పినపాక మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం పినపాక రైతు వేదికలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో సంకీర్త్, స్పెషల్ ఆఫీసర్ తాతారావు, అగ్రికల్చర్ ఏవో వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు , స్థానిక నాయకులు రైతులు పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు.సమావేశంలో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, వేసవి కాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ అందించే చర్యలపై చర్చించారు. రైతులకు సోలార్ మోటార్ల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. సోలార్ మోటార్ల వల్ల విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పగటి వేళల్లో నిరంతరాయంగా నీటి సరఫరా పొందవచ్చని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇవి దోహదపడతాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 23 గ్రామపంచాయతీలు సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు గవర్నర్ తీరు హాస్యాస్పదం

- విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి: జేబీపీ నేత యెర్రా కామేష్



**కొత్తగూడెం, మే 7 ( ప్రజాజ్యోతి )** తమిళనాడు గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు. గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన తమిళనాడు ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గవర్నర్ వ్యవస్థ పూర్తిగా రాజకీయమయమైందని ఆరోపించారు. గతంలో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలను గుర్తుచేస్తూ.. ముందుగా ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి అనంతరం అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించారు. అదే విధానాన్ని తమిళనాడులో కూడా అమలు చేసి విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీవీకే పార్టీకి 108 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ గవర్నర్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఇతర పార్టీలు ఎవరూ గవర్నర్‌ను కోరని పరిస్థితిలో విజయ్‌కు తొలి అవకాశం ఇవ్వకపోవడం వెనుక బీజేపీ రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయా అని నిలదీశారు. గవర్నర్ వ్యవహారం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, రాజ్యాంగ హక్కుల గురించి ప్రజలకు కూడా అవగాహన ఉందన్నారు. ఇప్పటికైనా గవర్నర్ ఆలస్యం చేయకుండా విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేబీపీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, ధనుంజయ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బండి దాడి చేయడం హేయమైన చర్య



**ఇల్లందు, మే 7, ప్రజాజ్యోతి:** కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బండి సంజయ్ అనుచరుల దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. అనునిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై బండి సంజయ్ అనుచరులు వీధి రౌడీల్లాగా విధ్వంసాన్ని సృష్టిస్తూ భయానక వాతావరణ కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న వారే హింసను ప్రోత్సహించడం పోలీసులు మౌనం వహించడం ఆశ్చర్యాన్ని కలిగించడమే కాక పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం చూస్తుంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏ విధంగా పనిచేస్తుందనేది విమర్శించారు. రాష్ట్రంలో హోం మంత్రి లేకనే శాంతి భద్రతలు అదుపుతప్పుతున్నాయని, ఇటువంటి అల్లరి మూకల దాడులు ఎక్కువ అవుతున్నాయని ఆరోపించారు. తమ నాయకులపై ఎన్ని కుట్రలు, దాడులు చేసినా బిఆర్ఎస్ పార్టీ వెనుకడుగు వేయదని ప్రభుత్వ వైఫల్యాల పట్ల ప్రజల సంక్షేమం కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు అన్ని నిష్ఠంగా గమనిస్తున్నారని ఇలాంటి విధ్వంస అరాచక రాజకీయ వ్యవస్థకు బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

## కాంట్రాక్టు కార్మికుల పట్ల సింగరేణి నిర్లక్ష్యం

- పెరిగిన విడిఏ వెంటనే చెల్లించాలి: భూక్య రమేష్



**కొత్తగూడెం, మే 7 ( ప్రజాజ్యోతి )**సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం, ముఖ్యంగా జీఎం (పర్సనల్) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్య రమేష్ విమర్శించారు. కాంట్రాక్టు కార్మికుల పని ప్రాంతాల్లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026 సంవత్సరానికి సంబంధించి పెరిగిన విడిఏ (వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్) వేతనాలను వెంటనే విడుదల చేసి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రతినెలా ఏడవ తేదీలోపు కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెంట్రల్ చీఫ్ లేబర్ ఆఫీస్ నుంచి పెరిగిన వేతనాలకు సంబంధించిన వివరాలు వచ్చినప్పటికీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయకుండా కార్మికులకు చెల్లింపులు నిలిపివేయడం ఎందుకని సింగరేణి అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమతో సింగరేణి లాభాలు ఆర్జిస్తోందని అలాంటి కార్మికుల సమస్యలను యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వెంటనే పెరిగిన విడిఏను విడుదల చేసి కార్మికులకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు భాస్కర్, గుగులోతు సక్రాం, అనిల్, రమేష్ పాసి తదితరులు పాల్గొన్నారు.

## పుల్లాయిగూడెంలో వైభవంగా ఆధ్యాత్మిక మహోత్సవాలు

- విశేష హోమాలు, జలాధివాసం, ధాన్యాధివాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహణ





**పాల్వంచ, మే 7, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పుల్లాయిగూడెం గ్రామంలో జరుగుతున్న ఆధ్యాత్మిక మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామ దేవాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుని భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 7.30 గంటల నుంచి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో చటుస్పాన్నులు, ఆవాహిత దేవతాహోమములు, విశేష మహాసుదర్శన హోమము, గరుడ మహామంత్ర హోమములు ఘనంగా నిర్వహించారు. వేదఘోషల మధ్య జరిగిన ఈ హోమాల్లో గ్రామస్తులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం విశ్వశాంతి, సకల శుభసంపదల కోసం జలాధివాస కార్యక్రమం అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. మధ్యాహ్నం నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.సాయంత్రం కార్యక్రమాలు మరింత వైభవంగా కొనసాగాయి. వేదపారాయణాలు, మూలమంత్ర హోమములు, అంగహోమములు, స్పర్శహోమములు, కళాహోమములు, ప్రాణాది దశవాయువాస హోమములు, కళాన్యాస హోమములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధాన్యాధివాసము, పుష్పాధివాసము కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.ప్రత్యేకంగా నిర్వహించిన ధాన్యాధివాస కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు తమ శక్తికొలది ధాన్యాన్ని సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల సమర్పణలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ ఆధ్యాత్మిక వేడుకలను తిలకించేందుకు పుల్లాయిగూడెం గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక సందడి నెలకొంది.రాత్రి నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద గోష్టితో కార్యక్రమాలు ముగిశాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశా రు. గ్రామంలో కొనసాగుతున్న ఈ మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి.

## కుమార్తె పుట్టినరోజున 'అక్షర' కానుక: పేద విద్యార్థినికి అండగా నిలిచిన తండ్రి

- పదో తరగతి వరకు ఏటా రూ. 12 వేల ఆర్థిక సాయం
- కూలి పనులు చేసుకునే కుటుంబానికి భరోసా
- భద్రాచలం వాసి భార్గవ్ ఔదార్యం



**భద్రాచలం టౌన్, మే 07 ప్రజాజ్యోతి** సాధారణంగా పుట్టినరోజు వేడుకలంటే కేకులు, విందులు, వినోదాలతో ఆర్భాటంగా జరుపుకోవడం చూస్తుంటాం. కానీ, భద్రాచలానికి చెందిన భార్గవ్ అనే వ్యక్తి తన కుమార్తె పుట్టినరోజును సామాజిక బాధ్యతతో ము డిపెట్టి అందరికీ ఆదర్శంగా నిలిచారు. త న కూతురు శ్రీనిక ఐదవ పుట్టినరోజు సందర్భంగా, తండ్రి లేని ఒక పేద విద్యార్థినిని ప దో తరగతి వరకు చదివించే బాధ్యతను స్వీ కరించి తన పెద్ద మనసును చాటుకున్నారు.

**మిత్రుని ద్వారా అందిన సమాచారంతో.**

.రాజుపేట కాలనీకి చెందిన బండి కుమారి (26) అనే మహిళ, భర్త చనిపోవడంతో కూలి పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. ఆమె ఆర్థిక ఇబ్బందుల గురించి భార్గవ్ తన మిత్రుడు రాజా కిరణ్ ద్వారా తెలుసుకున్నారు. కుమారి పెద్ద కుమార్తె బండి స్నేహిత పూర్ణిమ (10) ప్రస్తుతం మూడవ తరగతి చదువుతోంది. ఆ చిన్నారి చదువుకు పేదరికం అడ్డుకాకూడదని భావించిన భార్గవ్, తన కుమార్తె శ్రీనిక పుట్టినరోజును పురస్కరించుకుని స్నేహితను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు.పదో తరగతి వరకు భరోసాగురువారం నాడు తన మిత్రుడు కిరణ్ ద్వారా రూ. 12,000 నగదును ఆ కుటుంబానికి అందజేశారు. కేవలం ఈ ఏడాది మాత్రమే కాకుండా, పాప పదో తరగతి పూర్తయ్యే వరకు ప్రతి ఏటా రూ. 12,000 విద్యా సాయం అందిస్తానని భార్గవ్ హామీ ఇచ్చారు. తన కుమార్తె పెద్దయ్యాక, తన పుట్టినరోజు కారణంగా మరో బాలిక విద్యావంతురాలైందని తెలుసుకుని గర్వపడాలన్నదే తన ఆశయమని ఆయన పేర్కొన్నారు. "వృథా ఖర్చులకు పోకుండా ఒక నిరుపేద బిడ్డ భవిష్యత్తుకు బాటలు వేసిన భార్గవ్ ఆలోచనా విధానం నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకం." అని స్థానికులు కొనియాడుతున్నారు.

## మాలల న్యాయపోరాట సభకు సన్నాహాలు

- ఎస్సీ ఉపవర్గీకరణపై మాల సంఘాల ఐక్య స్వరం



**కొత్తగూడెం, మే 7 ( ప్రజాజ్యోతి )**ఎస్సీ ఉపవర్గీకరణ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో మాల సంఘాలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చాయి. ఈ నెల 10న కొత్తగూడెంలోని జీవిఎస్ మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మాలల న్యాయపోరాట సభ కు సంబంధించిన కరపత్రాన్ని గురువారం సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలతో 59 షెడ్యూల్ కులాలను కులాల ఆధారంగా వర్గీకరించడం సమంజసం కాదన్నారు. సుప్రీంకోర్టు సూచించిన విధంగా ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా ఎంపిరికల్ డేటా సేకరించి ఎస్సీ ఉపవర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని అన్ని మాల సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి న్యాయపోరాటాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే తరాల భవిష్యత్తు, విద్యా, ఉద్యోగ అవకాశాల పరిరక్షణ కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ ఫర్ మాల సభ్యులు, రిటైర్డ్ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, అడిషనల్ జనరల్ మేనేజర్ గొనె శ్రీకాంత్, ఆచార్య డా. మద్దెల శివకుమార్, మాలమహానాడు సెక్రటరీ జనరల్ ఎస్. మధుసూదన్ (చిన్ని), జె. శ్రీనివాస్, గడ్డం రఘున్ బాబు, ఎన్.డి. సాగర్, దార్ల లక్ష్మి, దాసరి రమేష్, శనగ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

- మత సామరస్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : డీఎస్పీ అరుణ్ కుమార్

**భద్రాచలం, మే 7, ప్రజా జ్యోతి :** రాబోయే బక్రీద్ పండుగను ప్రజలంతా శాంతియుత వాతావరణంలో, మత సామరస్యంతో ఆనందంగా జరుపుకోవాలని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం డీఎస్పీ కార్యాలయంలో మత పెద్దలతో శాంతి భద్రతల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరస్పర గౌరవ భావనతో వ్యవహరించాలని కోరారు. అన్ని మతాల ప్రజలు ఐక్యతా భావంతో పండుగలను జరుపుకోవడం ద్వారా సమాజంలో సోదరభావం, సామరస్య వాతావరణం మరింత బలపడుతుందని తెలిపారు.మత పెద్దలు ప్రజల్లో అవగాహన కల్పించి, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. పండుగ వేళల్లో అసాంఘిక శక్తుల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, గొడవలకు ప్రేరేపించే చర్యలకు పాల్పడినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పండుగల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే సందేశాలను పంపకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సమాచారం కనిపించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ఈ సమావేశంలో పట్టణ పోలీసు అధికారి నాగరాజు, ఉప పోలీసు అధి



కారి రామకృష్ణతో పాటు భద్రాచలం పట్టణానికి చెందిన వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుల రాస్తారోకో







**టేకులపల్లి,మే07,ప్రజాజ్యోతి:** అరుకాలం కష్టపడి పండించిన మొక్కజొన్న కోనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు కొత్తగూడెం- ఇల్లందు ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మొక్కజొన్న పంటను కోనుగోలు కేంద్రం వద్ద 4 రోజులుగా కోనుగోలు చేయట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రటి ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నప్పటికీ రైతులను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్య క్తం చేశారు. కోనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసి మొక్కజొ న్న పెట్టేందుకు స్థలం లేదని, కారేపల్లి వద్దకు వెళ్లాల ని చెబుతున్నారని రైతులు తె లిపారు. మార్కెట్ కు తాళం వేశారని, రైతులుకు మంచి నీటి సౌకర్యం కుడా లేదని విమర్శించారు. రోడ్డుపై బైఠాయించోద్దని, కేసులు నమోదు అవుతాయని పోలీసులు తెలపడంతో కేసులకైనా సిద్ధంగా ఉన్నామని, ఉన్నతాధికారులు రావాలని, మొక్క జొన్న కోనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం తహాసిల్దార్ వీరభద్రం మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దని, కొనుగోలు చేసిన మొక్కజొన్నను తరలించడానికి వాహనాల ఇబ్బందిగా ఉన్నందున రైతులు అర్ధం చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ తో మాట్లాడి రవాణాకు లారీలు వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ లో మొక్కజొన్నల టిక్కీలు పెట్టడానికి స్థలం లేదందున్న రైతులు పిఏసిఎస్ సిబ్బందిని అర్థం చేసుకొని, ఇక్కడున్న స్టాకు అయ్యేంతవరకు రైతులు కొంత సమయం తీసుకోని మార్కెట్ యార్డ్ కు మరల మొక్కజొన్నలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## కే టి పీ ఎస్ 5,6,7 దశల కర్మాగారాలను సందర్శించిన సందర్శించిన టీజీ జెన్కో డైరెక్టర్ ధర్మల్

- ప్లాంట్ పిఎల్ఎఫ్ పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- జెన్కో డైరెక్టర్ ధర్మల్ రాజశేఖర్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 7,(ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని కె టి పి ఎస్ 5 ,6 ,7 దశల కర్మాగారాలను గురువారం సాయంత్రం టీజీ జెన్కో డైరెక్టర్ ధర్మల్ అండ్ ప్రాజెక్ట్ రాజశేఖర్ రెడ్డి సందర్శించారు, ఈ సందర్భంగా డైరెక్టర్ కర్మాగారాల్లోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు అనంతరం కర్మాగారాలకు చెందిన సి ఈ లతో, పలువురు ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ ప్లాంట్లలో పిఎల్ఎఫ్ పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు, అదేవిధంగా A1 వినియోగాన్ని ప్లాంట్ లో వాడేందుకు దానికి సంబంధించిన డేటాను కలెక్ట్ చేయాలని ఆదేశించారు, అదేవిధంగా కేటీపీఎస్ లో విధులు నిర్వహిస్తున్నడి ఈ లకు, ఏడి ఈ లకు, ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో ఆయన వెంట కేటీపీఎస్ 5 6 దశల చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావు , ఏడోదశ చీఫ్ ఇంజనీర్ సూర్యనారాయణ తో పాటు పలువురు ఇంజనీర్లు సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కత్తితో పోలీసులపై దాడికి ప్రయత్నం...!

- నన్నే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తారా...



**మణుగూరు క్రైం, మే 07 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క సారక్క గుడి వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పోలీసులపై కత్తితో దాడికి ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో మద్యం మత్తులో తోగ్గూడెం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న సోలెం నాగేశ్వరరావును ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 80 బిఏసి పర్సంటేజ్ నమోదయిందని పోలీసులు తెలిపారు. దీంతో పోలీసులు అతనిని తిరిగి ఇంటికి పంపించారు. ఈ నేపథ్యంలో అతను ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి నాపైనే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తారా అని పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. అంతేకాకుండా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసు విధులను ఆటంకపరిచిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపామని సిఐ నాగబాబు తెలిపారు.

## నూతన తహశీల్దార్ ఉమారాణికి ఘన సన్మానం



**ఆళ్ళపల్లి.మే7.ప్రజాజ్యోతి** ఆళ్ళపల్లి మండల నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన.ఉమారాణి ని మర్కోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో. సుతారి రమాదేవి. మర్కోడు సర్పంచ్ వగలబోయిన సతీష్. ఉపసర్పంచ్ .పడిగ సమ్మయ్య.మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.సుతారి కృష్ణ చీమల శేఖర్, జనగం సాయి, శేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని, తహశీల్దార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏకలవ్య స్కూల్ లో కొనసాగుతున్న ఎన్సీసీ వార్షిక శిక్షణ శిబిరం





**టేకులపల్లి,మే07,ప్రజాజ్యోతి:**తెలంగాణ 11బెటాలియన్ ఖమ్మం ఆధ్వర్యంలో బద్దు తండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో నిర్వహిస్తున్న ఎన్సీసీ వార్షిక శిక్షణ శిబిరం ఉత్సాహ భరితంగా కొనసాగుతోంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కే. భద్ర పర్యవేక్షణలో జరుగుతున్న ఈ శిక్షణ శిబిరంలో క్యాడెట్లకు వివిధ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నాలుగో రోజు శిక్షణ శిబిరంలో కార్యక్రమంలో ఇల్లందు ఫైర్ స్టేషన్ కు చెందిన ఫైర్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ వారి బృందం పాల్గొని ఎన్సిసి క్యాడెట్లకు అగ్నిమాపక భద్రతపై అవగాహన కల్పించడం జరిగింది. మంటలు చెలరేగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,మంటలను అదుపులోకి తీసుకురావడానికి అనుసరిం చాల్సిన విధానాలు, అగ్నిప్రమాదాల రకాలు,వాటికి అనుగుణంగా ఉపయోగించే ఫైర్ ఎ క్స్ టింగ్విషర్ పరికరాల వినియోగంపై వివరంగా క్యాండెట్స్ కు తెలియజేశా రు. అలాగే మంటలు వ్యాపించకుండా నివారించడానికి తీసుకోవాల్సిన చర్య లు వారు తెలిపారు. అగ్ని ఏర్పడటానికి కారణమయ్యే త్రికోణ అంశాలు (ఫైర్ ట్రై యాంగిల్ ) గురించి వివరించారు. మంటలు రగలడానికి అవసరమైన పదార్థా లు ఏమిటి,వాటిని ఎలా నియంత్రణలో ఉంచాలో ప్రాయోగికంగా చూపించి క్యాడెట్లలో అవగాహన పెంపొందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ 11 బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కే. భద్ర, ఇన్ చార్జ్ ఏఎన్ఓ లెఫ్టినెంట్ శ్రీలత, క్యాంప్ అడ్జుటెంట్ సెకండ్ ఆఫీసర్ ఉపేందర్ నాయక్, సుబేదార్ మేజర్ బాల్ బహదూర్ పున్, ట్రైనింగ్ జేసీవో మాలి నారాయణ్,ఎన్సీసీ అధికారులు రాజా గౌడ్, రాజసింహ,మహేందర్, అపూర్వ దేవి, వినోద్, చిరంజీవి, మనోహర్,నిషా,బాల,సివిల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వారం

# విద్యుత్ సేవలతో గిరిజన రైతులకు మహర్దశ





**టేకులపల్లి,మే07, ప్రజాజ్యోతి:** మండలంలోని ముత్యాలంపాడుక్రాస్ రోడ్ రైతు వేదికలో 99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రైతు వారం ప్రోగ్రాం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ,ఏడీ రఘురామయ్య పాల్గొన్ని,ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాలు –సౌర విద్యుత్ కేంద్రాలు అంశం పై అవగాహన నిర్వహించారు. మోడల్ సోలార్ విలేజెస్ పీఎం కొసం కాంపోనెంట్ 1 కాంపోనెంట్ 2 స్కీముల గురించి టీజీఎన్ పీడీసీల్ విద్యుత్ శాఖలోని భద్రత నా గురించి వాటి ప్రయోజనాలు వివరించారు. మండలంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటూ నిరంతరం సప్లై ఇచ్చే విధంగా ఏర్పాటు చేశామని అలాగే మండలంలోని రేషన్ కార్డు ఉన్న వినియోగదారులకు గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అలాగే రైతులకు మోటార్ కు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని అన్నారు.ఎవరైనా రైతులు ముందుకు వస్తే వారు తమ వ్యవసాయ క్షేత్రంలోనే సోలార్ విద్యుత్ను తయారు చేయవచ్చునని దానికోసం సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్ పిఎం –కెయుఎస్యుఎం ద్వారా రైతులు విద్యుత్ తయారు చేసి ఆదాయం పొందవచ్చునని అలాగే రాబోయే తరంలో ప్రకృతి వనరులను సంరక్షిస్తూ సోలార్ విద్యుత్తును ప్రోత్సహించాలని ఆ విధంగానే గృహ వినియోగదారులు కూడా పిఎం – సూర్యాఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్స్ ను తమ ఇండ్లపై ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఆదా చేస్తూ అందరూ కూడా సోలార్ విద్యుత్తు వినియోగాన్ని తెలుసుకొని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ దేవ, సబ్ ఇంజనీర్ ప్రసాదు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్యారెట్ జ్యూస్ ఆరోగ్య ప్రయోజనాలు

**క్యారెట్ జ్యూస్ :** కంటి చూపును మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని రక్షించడం మరియు శరీరంలో రక్తాన్ని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. బీటా –కెరోటిన్ మరియు విటమిన్ A పుష్కలంగా ఉండే ఈ జ్యూస్ను ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తగ్గుతాయి. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది.

**క్యారెట్ జ్యూస్ ఆరోగ్య ప్రయోజనాలు:** **కంటి ఆరోగ్యం:** క్యారెట్ లో ఉన్న బీటా కెరోటిన్ విటమిన్ Aగా మారి, కంటి చూపును మెరుగుపరుస్తుంది.
**రోగనిరోధక శక్తి:** ఇది శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.**చర్మ సౌందర్యం:** చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా మార్చడంలో సహాయపడుతుంది.**రక్తహీనత నివారణ:** 7 రోజులు క్రమం తప్పకుండా తాగితే రక్తహీనత తగ్గుతుంది.**జీర్ణక్రియ:** మెరుగైన జీర్ణక్రియకు మరియు కాలేయ శుద్ధికి దోహదపడుతుంది.





# పాల్వంచ చెంతనే...

# 'పవర్' కష్టాలు

- వేసవిలో లక్ష్మీదేవిపల్లి విలవిల
- లోవోల్టేజ్‌తో అంధకారంలో గ్రామ జీవనం
- వెలుగులు పంచే పాల్వంచలోనే చీకటి కష్టాలు
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న గ్రామస్తులు

## వెలుగుల నీడలో వోల్టేజ్ చీకట్లు

**మండుతున్న ఎండలు, ఉక్కపోత వాతావరణం, మరోవైపు తీవ్రమైన లోవోల్టేజ్ సమస్య... ఈ రెండింటి మధ్య లక్ష్మీదేవిపల్లి గ్రామ ప్రజల జీవితం దుర్భరంగా మారిందని, పేరుకు విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ, ఇళ్లలో సరిపడా వోల్టేజ్ అందక నరకయాతన అనుభవిస్తున్నామని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎన్నో ఏళ్లుగా సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకున్నా స్పందన లేక పోవడంతో గ్రామస్తుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.**

● పాల్వంచ, ప్రజాజ్యోతి

### ››› 100 నుంచి 150 వోల్టుల మధ్యే

సాధారణంగా గృహ వినియోగానికి 230 నుంచి 240 వోల్టుల వరకు విద్యుత్ రావాల్సి ఉండగా, గ్రామంలో ప్రస్తుతం నమోదవుతున్న విద్యుత్ వోల్టేజ్ కేవలం 100 నుంచి 150 వోల్టుల మధ్యే. ఈ లోపం కారణంగా విద్యుత్ పరికరాలు సరిగా పనిచేయకపోవడమే కాకుండా తరచూ చెడిపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› ఫ్యాను లాంటిది, కానీ ఫ్యాను కాదు

వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న ఈ సమయంలో ఇళ్లలో ఉన్న సీలింగ్ ఫ్యాన్లు తిరగని పరిస్థితి నెలకొంది. కొన్ని ఇళ్లలో ఫ్యాన్లు కేవలం కదిలినట్టే కదులుతుండగా, మరికొన్ని చోట్ల పూర్తిగా ఆగిపోతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో ఉక్కపోతను తట్టుకోలేక ప్రజలు నిద్రలేక ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు ఇధి ఫ్యాను లాంటిది, కానీ ఫ్యాను కాదు అని చమత్కారంగా మాట్లాడుకుంటున్నారు.

### ››› ఆన్ కూడా అవ్వని ఏసిలు, ఫ్రిజ్ లు

ఇక ఆధునిక అవసరంగా మారిన ఎయిర్ కండిషనర్లు (ఏసీలు) అయితే అసలు ఆన్ కూడా కావడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అధిక ధరలకు కొనుగోలు చేసిన ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు విద్యుత్ ఒత్తిడి తక్కువగా ఉండటంతో పనికిరాక మూలనపడుతున్నాయని వాపోతున్నారు.

### ››› రాత్రిళ్ళు మరింత కష్టం గా ఉందంటున్న ప్రజలు

ఈ సమస్యతో ముఖ్యంగా చిన్న పిల్లలున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రంతా పిల్లలు చెమటలు కారుస్తూ ఏడవడంతో తల్లిదండ్రులు మేల్కొని ఉండాల్సి వస్తోందని, వృద్ధులు శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. వేసవి ఉక్కపోతలో కనీసం ఫ్యాన్ గాలి కూడా అందక రాత్రులు గడపడం కష్టంగా మారిందంటున్నారు.



ఎన్నిసార్లు పిర్యాదు చేసిన స్పందించని అధికారులు, కొత్తగా సమస్య మా దృష్టిలో లేదు అని చెప్పడం సరి కాదు. అనువైన చోట ప్రజలకు ఉపయోగపడే లాగా ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేయాల్సింది పోయి ఇలా కాలం గడపటం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.చిన్న పిల్లలు, వృద్ధులు, వేసవి ఉక్కపోత తట్టుకోలేక రాత్రంతా జాగారం చేయాల్సిన దుస్థితి ఉంది. దయచేసి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించగలరు
**–తేనె మధుసూదన్ రావు, లక్ష్మీదేవిపల్లి.**

### ››› చెట్ల కిందకు వెళ్లి సేదతీరాల్సిన దుస్థితి

పగటి వేళల్లో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొనడంతో గ్రామస్తులు చెట్ల కిందకు వెళ్లి సేదతీరాల్సిన దుస్థితి ఏర్పడింది. విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో వేడి భరించలేక పిల్లలు, మహిళలు, వృద్ధులు చెట్ల నీడనే ఆశ్రయిస్తున్నారు.

### ››› ఏళ్ళ నాటి నిరీక్షణ

గ్రామ ప్రజలు చెబుతున్న వివరాల ప్రకారం, ఈ సమస్య కొత్తది కాదు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం కనిపించలేదని విమర్శిస్తున్నారు.

### ››› ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడమే కారణమా ..?

ప్రధానంగా గ్రామానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు అమలు కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, గృహాల సంఖ్యకు తగిన విధంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరించకపోవడమే ఈ సమస్యకు కారణమని వారు చెబుతున్నారు.



విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న పాల్వంచలోని పరిస్థితి ఇలా ఉంటే ఇంకా మారుమూల గ్రామ ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో..! ఎన్ని సార్లు లోవోల్టేజ్ సమస్య గురించి పిర్యాదు చేసిన మా సమస్య పరిష్కారం కాట్లేదు. దయచేసి కరెంటు అధికారులచే అదనపు ట్రాన్స్ఫర్మర్ ఏర్పాటు చేయిం చి ప్రజలను వేసవి కష్టాల నుండి కాపాడవలసిందిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ని వేడుకుంటున్నాము.**–తేజావత్ ధరణి, లక్ష్మీదేవిపల్లి.**

### ››› రిపేర్ల తో ప్రజలపై మరింత భారం

లోవోల్టేజ్ కారణంగా టీవీలు, ఫ్రిజ్‌లు, మోటార్లు, ఇన్వర్టర్లు, చార్జర్లు వంటి ఎలక్ట్రిక్ పరికరాలు తరచూ చెడిపోతున్నాయి.రిపేర్ చేయించేందుకు భారీగా ఖర్చు చేస్తున్నా, కొద్ది రోజులకే మళ్లీ అదే పరిస్థితి వస్తోందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. దీని వల్ల ఆర్థికంగా కూడా నష్టపోతున్నామని చెబుతున్నారు.

### ››› అధికారులు స్పందించాలి

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిశీలించి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, తగిన వోల్టేజ్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని లక్ష్మీదేవిపల్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
సమస్య పరిష్కారంలో ఇంకా జాప్యం జరిగితే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.